సాక్షి ప్రకాశం

శనివారం । 1 । జూలై । 2023



కల సాకారం

పొదిలి పట్టణ ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతోంది. రూ.50.13 కోట్లతో మంచినీటి పథకం పనులు ప్రారంభమయ్యాయి.

- IIలో..



మహిళల బ్యాగులే లక్ష్యంగా చోరీలు

మహిళల బ్యాగులే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు మహిళలను పోలీసులు అరెస్టు చేశారు.

- IIలో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38 /30

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రేపు ప్రకాశం జిల్లా సీనియర్స్ పురుషుల క్రికెట్ జట్టు ఎంపిక

ఒంగోలు: స్థానిక ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ మినీ లార్డ్స్ గ్రౌండులో జూలై 2న ప్రకాశం జిల్లా సీనియర్స్ పురుషుల క్రికెట్ జట్టు ఎంపిక నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ ఎం.వీరరాఘవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఎంపికైన వారు జూలై 4 నుంచి మూలపాడులో జరిగే అంతర్ జిల్లాల సీనియర్స్ క్రికెట్ పోటీల్లో ప్రకాశం జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు సెల్: 9246222999 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సత్తా చూపిన కర్నూలు జిల్లా ఎడ్లు



బండలాగుతున్న ఎడ్లు

యర్రగొండపాలెం: మండలంలోని బోయల పల్లె గ్రామంలో ఆత్మానందా అవధూత స్వామి ఆరాధన మహోత్సవాల సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన పాలపండ్ల ఎడ్ల పందేల్లో కర్నూలు జిల్లా మునగాల, గూడూరుకు చెందిన ఎడ్లు 4 వేలు అడుగులు బండను లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా వినుకొండ ఏఎంసీ చైర్మన్ బత్తుల చిన్నబ్బాయి, పద్మావతి యాదవ్ ఎడ్లు 3517 అడుగులు లాగి ద్వితీయ స్థానం, ప్రకాశం జిల్లా కంభం మండలంలోని ఎర్రబాలేనికి చెందిన వెంకటగిరి హేమలతనాయుడు ఎడ్లు 3507 అడుగులు లాగి తృతీయ స్థానం, సూరెపల్లి, చినగానిపల్లెకు చెందిన ఎడ్లు 2750 అడుగులు లాగి 4వ స్థానం, యర్రగొండపాలెం మండలంలోని గోళ్లవిడిపికి చెందిన కంగటి పుల్లారెడ్డి ఎడ్లు 1750 అడుగులు లాగి 5వ స్థానంలో నిలిచాయని యాంకర్ గూడ శ్రీనవాసరావు తెలిపారు. విజేతలకు బహుమతులందించారు.

వెబ్‌సైట్‌లో ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా

ఒంగోలు: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ నుంచి ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల నిమిత్తం సీనియార్టీ జాబితాను డీఈవోప్రకాశం.కో.ఇన్ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాతోపాటు సెకండరీ గ్రేడ్ టీచర్స్ నుంచి స్కూల్ అసిస్టెంట్ (లెక్కలు, ఇంగ్లిష్, సోషల్, బయాలజీ, భౌతిక శాస్త్రం) సీనియార్టీ జాబితాను కూడా వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. ఉపాధ్యాయులు తమ సీనియార్టీ మీద ఏదేని అభ్యంతరం ఉంటే శనివారం సాయంత్రం 5 గంటల్లోగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు.

జిల్లాలో రూ.13 కోట్ల విద్యుత్ బకాయిలు

- అందుబాటులో 2 వేల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- విద్యుత్ ఎస్ఈ సత్యనారాయణ వెల్లడి



మాట్లాడుతున్న ఎస్ఈ సత్యనారాయణ

మార్కాపురం: జిల్లాలో మొత్తం రూ.13 కోట్ల విద్యుత్ బకాయిలు వసూలు కావాల్సి ఉందని, వీటికోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామని విద్యుత్‌శాఖ ఎస్ఈ కేవీ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన మార్కాపురంలోని ఈఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ జిల్లాకు 2 వేల కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు వచ్చాయని, అవసరమైన చోట ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇటీవల జరిగిన జెడ్పీ సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీలు విద్యుత్ సమస్యలపై మాట్లాడారని, వాటిపై తమ సిబ్బందితో చర్చించామని అన్నారు. రైతులు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే తమకు వెంటనే సమాచారం అందించాలని, సిబ్బంది వెళ్లి మరమ్మతులు చేస్తారని చెప్పారు. మార్కాపురం డివిజన్‌కు 100 నుంచి 120 ట్రాన్స్‌ఫార్మర్లు అవసరమవుతాయని గుర్తించినట్లు తెలిపారు. గతేడాది జిల్లాలో 8800 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని, ప్రస్తుతం మార్కాపురం డివిజన్‌లో 566 మంది రైతులు కొత్త కనెక్షన్లు కావాలని దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వీటిని పరిశీలించి రైతులకు అందిస్తామన్నారు. జిల్లాలో మొత్తం జగనన్న లేఅవుట్లలో 1473 ఇంటి కనెక్షన్లకు గానూ 1032 ఇంటి కనెక్షన్లు ఇచ్చామని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది కూడా కచ్చితంగా పాల్గొనాలని ఆదేశించినట్లు చెప్పారు.

దొంగ ఓట్లు.. ఆ పాపం టీడీపీదే..

గత ప్రభుత్వ హయాంలో మళ్లీ ఎలాగైనా అధికారంలోకి రావాలన్న దుర్బుద్ధితో టీడీపీ నేతలు ఇష్టారీతిగా దొంగ ఓట్లు చేర్పించారు. ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులు ఓటర్ల జాబితాలను పరిశీలించి లోపాలను సరిచేస్తున్నారు. దీంతో ఉలిక్కిపడిన టీడీపీ నేతలు ఇప్పుడు ఎక్కడ తమ బండారం బయటపడుతుందోనని భయపడి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అక్రమంగా ఓట్లు చేర్చారంటూ పచ్చమీడియాలో గగ్గోలు పెడుతున్నారు. తాము చేసిన తప్పులకు వక్రభాష్యాలు చెబుతూ విషప్రచారానికి తెరలేపారు. దొంగే దొంగా దొంగ అని అరిచినట్లు ఉంది టీడీపీ నేతల తీరు.

తవ్వే కొద్దీ టీడీపీ చేసిన అక్రమాలు....

కేంద్ర ఎన్నికల సంఘం ఓట్ల సవరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడంతో తవ్వేకొద్దీ.. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన పాపాలు బయట పడుతున్నాయి. 2017 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రేషనలైజేషన్ కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా ఒంగోలు నగరంలో పాత ఇంటి నంబర్ల స్థానంలో కొత్త ఇంటి నంబర్లు కేటాయించారు. కొత్త ఇంటి నంబర్లు కేటాయించిన తరువాత చంద్రబాబు దొంగ ఓట్ల చేరికలకు శ్రీకారం చుట్టాడు. ఆ నేపథ్యంలో ఒంగోలు నగరంలోని పలు డివిజన్లలో ఒకే డోర్ నంబరుపై వందల కొద్దీ ఓట్లు చేర్పించేలా అధికారులపై ఒత్తిడి తెచ్చి మరీ బోగస్ ఓట్లు చేర్పించారు.



530 సీరియల్ నంబరుతో ఉన్న సులోమన్ కొర్నెపాటి ఓటు

- 2017లో రేషనలైజేషన్ పేరుతో ఒంగోలు నగరంలో ఇళ్లకు కొత్త నంబర్లు
- 2018లో ఒకే డోర్ నంబరుతో 142 ఓట్లు నమోదు
- ఒంగోలు నగరంలోని ధారావారి కుంటలో చోటుచేసుకున్న ఘటన
- 22-31-1589 ఇంటి నంబరుతో 142 మందిని ఇష్టానుసారం చేర్చిన వైనం
- అదికూడా కమ్మపాలెంలోని 7, 8 డివిజన్‌లలోనే చేర్పించటం గమనార్హం
- చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగానే ఈ మాయాజాలం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అక్రమంగా ఓటర్లను చేర్చిందంటూ పచ్చ మీడియా గగ్గోలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

టీడీపీ దొంగ ఓట్ల వేషాలు ఇప్పుడు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. రాష్ట్రం విడిపోయిన తరువాత 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తిరిగి 2019లో కూడా అధికారంలోకి రావాలని దొంగ ఓట్ల చేరికలకు పథక రచన చేశాడు. అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజా సంకల్పయాత్ర దెబ్బకు బెంబేలెత్తిన చంద్రబాబు ఏ రకంగానైనా అధికారాన్ని చేజిక్కించుకోవాలన్న కుయుక్తులు కోకొల్లలుగా చేసిన విషయం అందరికీ తెలిసిందే. అప్పట్లో ఐటీ గ్రిడ్ పేరుతో ఓటర్ల డేటాను తస్కరించి భారీగా దొంగ ఓట్లు చేర్పించిన ఘనుడు చంద్రబాబు.



సులోమన్ ఓటరు గుర్తింపు కార్డు

అయితే కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక ఓట్ల సవరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా రెవెన్యూ విభాగం అధికారులు ఓటర్ల జాబితాలను పరిశీలించే కార్యక్రమం చేపట్టారు. దీంతో ఒకే డోర్ నంబర్‌పై వందల కొద్దీ ఓట్లు చేరి ఉన్నట్లు ఇప్పుడు గుర్తించారు. దీంతో చంద్రబాబు హయాంలో చేసిన దొంగ ఓట్ల బాగోతం బట్టబయలవుతోంది. వాళ్లు చేసిన తప్పులు ఎక్కడ ప్రజల్లోకి వెళితే పార్టీ ఉనికికే ప్రమాదం వస్తుందని భావించిన టీడీపీ నేతలు వాళ్లు చేసిన తప్పులకు వక్ర భాష్యాలు చెబుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విష ప్రచారానికి తెరలేపారు. రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారు. దానికి పచ్చ మీడియా తానా..తందానా అని ప్రచారం చేపట్టింది.

ధారావారి కుంటలో ఒకే డోర్ నంబరుపై 142 ఓట్లు..

ఒంగోలు నగరంలోని కమ్మపాలెంలో 7, 8 ఒంగోలు నగర పాలక సంస్థ డివిజన్లు ఉన్నాయి. కమ్మపాలెంలోనే కలగలిసి ఉన్న ధారావారి కుంటలో కొత్తగా 22-31-1589 డోర్ నంబరును కేటాయించారు. అక్కడ అందరూ మున్సిపల్ కార్మికులు ప్రభుత్వ స్థలంలో అప్పట్లో గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారు. ఆ ఒకే డోర్ నంబరుపై 142 ఓట్లు చేర్పించారు. ప్రస్తుతం అధికారులు ఓటర్ల వెరిఫికేషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీంతో ఒకే డోర్ నంబరుపై 142 ఓట్లు ఉన్నట్లు గుర్తించారు. అదేవిధంగా 25-36-193 డోర్ నంబరులో 77 ఓట్లు, 36-72-536 డోర్ నంబరులో 70 ఓట్లు 09-16-61 డోర్ నంబరులో 75 ఓట్లు, 369-071-852 డోర్ నంబరులో 67 ఓట్లు, 04-06-685 డోర్ నంబరులో 53 ఓట్లు, 37-1-223 డోర్ నంబరులో 51, 37-80-78 డోర్ నంబరులో 54 ఓట్లు, 37-80-79 డోర్ నంబరులో 52 ఓట్లు నమోదు చేశారు.

బొల్లినేనివారి పాలెం వ్యక్తి ఓటు ఇక్కడి జాబితాలో....

సులోమన్ కొర్నిపాటి అనే వ్యక్తికి ఒంగోలు మున్సిపాలిటీలోని బొల్లినేని వారిపాలెం చాకలి వీధిలో యూపీడీ0615286 సీరియల్ నంబరుతో ఓటు ఉంది. అతనికి 2009 మార్చి 5వ తేదీన ఓటు కార్డు ఇచ్చారు. కార్డు ప్రకారం 42-1-196-18-5ఏ డోర్ నంబరులో అతనికి ఓటు ఉంది. కానీ సులోమన్ కొర్నిపాటి పేరు ధారావారి కుంటలో తయారు చేసిన ఓటర్ల జాబితాలో కూడా ఇతని పేరు ఉంది. బొల్లినేనివారి పాలెంకు చెందిన ఓటరు గుర్తింపు కార్డులో ఉన్న సీరియల్ నంబరు, ధారావారితోటలో తయారు చేసిన ఓటర్ల జాబితాలో ఉన్న గుర్తింపు కార్డు నంబరు ఒకటే. దీంతో రెండు చోట్ల ఓటు ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఈ విషయం ఆ ఓటరుకు కూడా తెలియదు అంటే టీడీపీ ప్రభుత్వ హయాంలో దొంగ ఓట్లు ఏవిధంగా చేర్చారో అర్థం చేసుకోవచ్చు.

టీడీపీ హైడ్రామా

దొంగే...దొంగ అన్నట్లుంది టీడీపీ నాయకుల వైఖరి. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు దొంగ ఓట్లకు తెరలేపారు. అధికారుల పరిశీలనలో వాళ్ల పాలనలో చేసిన అక్రమాలు వెలుగులోకి వస్తుంటే ఎక్కడ ప్రజల్లో అభాసు పాలవుతామోనని ఆ పార్టీ నాయకులు హైడ్రామాకు తెరలేపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దొంగ ఓట్లు రాజ్యమేలుతున్నాయంటూ శుక్రవారం టీడీపీ ఆధ్వర్యంలో ప్రకాశం భవనం ముందు ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు.

ఇప్పుడేమీ ఓట్ల చేర్పుల్లో అక్రమాలు జరగలేదు



ఓటర్ల చేర్పుల్లో ప్రస్తుతం ఏమీ అక్రమాలు జరగలేదు. ప్రస్తుతం ఓటర్ల జాబితాలను పరిశీలిస్తున్నాం. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జాబితాలను పరిశీలించి లోపాలను సరిచేయనున్నాం. ధారావారి కుంట ఓటర్ల విషయానికి వస్తే అది స్లమ్ ఏరియా కావటంతో గతంలో పూరి గుడిసెల పక్క నంబరు వేసి ఓట్లు ఇచ్చి ఉంటారు. ఇంటి నంబరు లేనప్పుడు పక్కన ఉన్న ఏదోఒక గుర్తింపును పరిగణలోకి తీసుకుంటాం. అయితే ధారావారి కుంటతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో ఒకే డోర్ నంబరుపై ఎక్కువ సంఖ్యలో ఓట్లు ఉన్నట్లు గుర్తించాం. అందుకుగాను కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ ఆదేశాల మేరకు ఆయా జాబితాలను పరిశీలిస్తున్నాం.

– వి.విశ్వేశ్వరరావు, ఆర్డీఓ, ఒంగోలు

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు అవసరమైన అన్నీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రకాశం భవనంలో శుక్రవారం జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రోడ్డు ప్రమాదాన్ని ఐ-రాడ్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. పోలీసు, ఆర్‌అండ్‌బీ, రవాణాశాఖ, జాతీయ రహదారుల అధికారులు ప్రమాదాలు జరగడానికి ఉన్న కారణాలను అధ్యయనం చేసి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఆటో, ట్రాక్టర్, స్కూల్‌బస్సు, లారీ యజమానులతో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఒంగోలు నగరంలో కొత్త బస్ షెల్టర్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 15 ఏళ్లు దాటిన ప్రభుత్వ వాహనాలను నిర్వీర్యం చేసేందుకు అన్నీ శాఖలు జాబితా తయారు చేయాలన్నారు. జిల్లాలో ప్రతి కార్యాలయానికి సంబంధించి అద్దె వాహనాల జాబితా కూడా సిద్ధం చేయాలన్నారు. సంఘమిత్ర హాస్పిటల్ నుంచి కలెక్టరేట్ వరకు రోడ్డు ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కృష్ణవేణి, డీటీసీ సుశీల, పశుసంవర్ధక శాఖ జేడీ బేబిరాణి, ఆర్టీసీ ఆర్ఎం సుధాకర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్, డిప్యూటీ డీఈఓ అనితారోజ్‌రాణి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, రవాణా శాఖ ఏఓ ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జూలై 3 నుంచి టైలరింగ్, డ్రాయింగ్ పరీక్షలు

ఒంగోలు: స్థానిక ఏబీఎం హైస్కూలులో డ్రాయింగ్, స్థానిక సెయింట్ జేవియర్స్‌లో టైలరింగ్ పరీక్షలు జూలై 3వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షల హాల్‌టికెట్లను అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి హాల్‌టికెట్‌తోపాటు ఏదైనా గుర్తింపు కార్డు తెచ్చుకోవాలన్నారు.

'జగనన్న సురక్ష' దేశంలోనే గొప్పది

- 99.5 శాతం పథకాలు అమలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- మిగిలిన శాతం భర్తీ చేయటానికే జగనన్న సురక్ష పథకం అమలు
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: దేశంలోనే గొప్ప ఘటనగా నిలిచే జగనన్న సురక్ష పథకానికి నేటి నుంచి శ్రీకారం చుడుతున్నామని, దీనివలన అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక మంత్రి క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన 4 సంవత్సరాల కాలంలో తానిచ్చిన మాట ప్రకారం 99.5 శాతం పథకాలు అమలు చేశారని, మిగిలిన అర శాతం భర్తీ చేయటానికి సీఎం జగన్మోహన్‌రెడ్డి ఫస్ట్ ర్యాంక్ విద్యార్థిగా తాపత్రాయపడుతున్నారని అన్నారు. పారదర్శకత, జవాబుదారితనం, అవినీతి రహిత, సమర్థత ఉన్న సీఎంగా జగన్మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారన్నారు. గత టీడీపీ పాలనలో ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించే క్రమంలో ఎంతో అవినీతికి పాల్పడిందని విమర్శించారు. జగనన్న పాలనలో అటువంటి పరిస్థితి లేకుండా అర్హతే ప్రామాణికంగా తీసుకొని రూ.2.16 లక్షల కోట్లు లబ్ధిదారులకు ముఖ్యంగా మహిళల అకౌంట్లలోకి నేరుగా బదిలీ చేశారని కొనియాడారు. ఈ పథకాలను చూసిన ప్రతిపక్షాలు అవినీతి జరిగిందని గగ్గోలు పెడుతున్నాయన్నారు. రాష్ట్రాన్ని దివాళా తీస్తున్నారని, ఈ పథకాల వలన అభివృద్ధి జరగదనిచెప్పిన వారు.. ఇప్పుడు ఎన్నికలు దగ్గరపడుతుండటంతో అటువంటి పథకాలను తాము కూడా అమలు చేస్తామని చెప్పుకుంటూ తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. తాను ముఖ్యమంత్రిగా గెలవలేనని, సంఖ్యా బలంలేదని, నేను అసెంబ్లీలో ఎంటర్ అయితే చాలు అంతకంటే ఎక్కువ అవసరం లేదని చెప్తున్న పవన్‌కల్యాణ్‌ను ప్రజలు ఏ విధంగా నమ్ముతారని ప్రశ్నించారు. తెలుగు దేశం పార్టీ మునిగి పోతున్న ఒక నావ అని, దానిని నమ్ముకొని ఆయన తిరుగుతున్నారని మంత్రి వ్యంగ్యంగా అన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మర్దన్‌అలి, తహసీల్దార్ కె.రవీంద్రరెడ్డి, ఎంపీడీవో వై.వి.నాగేశ్వరప్రసాద్, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, ఏఎంసీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ మూడమంచు బాలగురవయ్య, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, బి.వి.సుబ్బారెడ్డి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాష, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ షాబీర్‌బాష, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, సర్పంచ్ అరుణాబాయి, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి బి.బాలచెన్నయ్య, నాయకులు ఎస్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వర రెడ్డి, వై.ముసలారెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఒలింపిక్ రన్



ఒలింపిక్ రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- క్రీడాజ్యోతి వెలిగించి ప్రారంభించిన కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు: ఒలింపిక్ రన్ శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమైంది. స్థానిక ప్రకాశం భవనం వద్ద కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఒలింపిక్ పతాకాన్ని ఊపి ఒలింపిక్ రన్‌ను ప్రారంభించారు. క్రీడాజ్యోతిని చేతబట్టి క్రీడాకారులతోపాటు ఆయన పరిగెత్తారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఒలింపిక్ రన్ జూన్ 23 నుంచి 30వ తేదీ వరకు ఏదో ఒకరోజు నిర్వహిస్తుంటారన్నారు. జిల్లాలో ఈనెల 23న ప్రారంభించాలని భావించినా వర్షం కారణంగా వాయిదా వేయాల్సి వచ్చిందన్నారు. ఒలింపిక్ రన్ క్రీడాకారుల్లో స్ఫూర్తిని నింపడం, వారిలో నిబిడీకృతమైన శక్తి సామర్థ్యాలను వెలికితీసేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కూడా గ్రామీణ క్రీడాకారుల్లో ఉన్న సామర్థ్యాలను వెలికితీసేందుకు 'ఆడతాం ఆంధ్రా' అనే పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని త్వరలో నిర్వహించబోతున్నారన్నారు. పల్లె నుంచి జిల్లా వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లాలో క్రీడలను ప్రోత్సహించడంలో క్రీడాసంఘాల పాత్ర కూడా ఎక్కువగా ఉంటుందంటూ అభినందనలు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించేందుకు అవసరమైన సహకారాన్ని కలెక్టర్‌గా తప్పక అందిస్తానని వారికి హామీ ఇచ్చారు. క్రీడాకారులు, విద్యార్థులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసేందుకు ముందుకు వచ్చినందుకు ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. స్టెప్ సీఈవో బి.బాబూరావు మాట్లాడుతూ ఆరోగ్యం, శక్తివంతంగా ఉండడం కోసం ప్రతి వ్యక్తి రోజు కొంత కృషిచేయాలన్నారు. ఒలింపిక్ అసోసియేషన్ చైర్మన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఒలింపిక్ అసోసియేషన్‌లో మొత్తం 41 క్రీడా సంఘాలు ఉన్నాయని, అన్ని క్రీడా సంఘాల తరపున కార్యక్రమ నిర్వహణను జయప్రదం చేసేందుకు ముందుకొచ్చామన్నారు. అనంతరం మినీ స్టేడియంలో ఫెన్సింగ్, కరాటే పోటీల విజేతలకు ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుర్రాభాస్కరరావు చేతులమీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో చీఫ్ కోచ్ గుంటి రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

సమాజంలో ఉన్నతమైన పౌరులుగా ఎదగాలి

- నైతిక విలువలతో కూడిన జీవనం వలనే అది సాధ్యం
- బాలసదన్, శిశు గృహను పరిశీలించిన హైకోర్టు న్యాయమూర్తి, హైకోర్టు జువైనల్ జస్టిస్ కమిటీ సభ్యురాలు పి.వెంకట జ్యోతిర్మయి



శిశు గృహలో చిన్నారితో న్యాయమూర్తులు

ఒంగోలు సబర్బన్: సమాజంలో ఉన్నతమైన పౌరులుగా ఎదగాలని, ఆ విషయాన్ని అందరూ గుర్తెరగాలని హైకోర్టు న్యాయమూర్తి, హై కోర్టు జువైనల్ జస్టిస్ కమిటీ సభ్యురాలు పి.వెంకట జ్యోతిర్మయి అన్నారు. ఈ మేరకు న్యాయమూర్తి శుక్రవారం ఒంగోలు నగరంలోని రామ్‌నగర్‌లో ఉన్న బాల సదన్, శిశు గృహలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి వెంకట జ్యోతిర్మయి మాట్లాడుతూ విలువలతో కూడిన విద్య, నైతిక విలువలతో కూడిన జీవనం ద్వారానే సమాజంలో ఉన్నతమైన పౌరులుగా ఎదగవచ్చని పేర్కొన్నారు. అక్కడ విద్యార్థులతో మాట్లాడారు. వారికి అందిస్తున్న వసతి సదుపాయాలు, భోజన వసతి సౌకర్యాల గురించి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. మరింత భోజన సౌకర్యాల గురించి నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రికార్డులు తనిఖీ చేశారు. బాత్‌రూముల తీరును కూడా పరిశీలించారు. సాంకేతిక కారణాలతో పాఠశాలలో చేరలేని ఒక విద్యార్థిని గుర్తించి ఆ విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ దృష్టికి తీసుకెళ్లారు. విద్యాశాఖ అధికారుల సమన్వయంతో ఆ విద్యార్థినిని పాఠశాలలో చేర్పించారు. మరో బాలికను టైలరింగ్ శిక్షణ నేర్చుకునే నిమిత్తం రూడ్ సెట్ స్వచ్ఛంద సంస్థలో టైలరింగ్ శిక్షణలో చేర్చేలా చర్యలు తీసుకున్నారు. తరువాత పోక్సో బాధిత బాలికలతో మాట్లాడారు. వారి భవిష్యత్తు మరింత ఉన్నతంగా ఉండటానికి ప్రణాళికాబద్ధమైన సూచనలు అందించారు. అనంతరం రాంనగర్‌లోని మున్సిపల్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను కూడా సందర్శించారు. అక్కడ విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. మధ్యాహ్న భోజనం అందుతున్న తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తరువాత జువైనల్ జస్టిస్ కార్యకలాపాలు పరిశీలించారు.

అక్కడ నేరం మోపబడిన పిల్లలతో మాట్లాడారు. వారి నేరం వివరాలు తెలుసుకున్నారు. అవసరమైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని వివరించారు. తరువాత బాలల సంక్షేమ కమిటీ కార్యాలయానికి వెళ్లారు. ఉదయం 11.30 గంటల సమయంలో కార్యాలయంలో ఎవరూ లేకపోవటాన్ని గుర్తించారు. హైకోర్టు న్యాయమూర్తి వెంట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా న్యాయమూర్తి కే.శ్యాంబాబుతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

బూచేపల్లి కృషితో తీరిన విద్యార్థుల కష్టాలు



బస్సు లేక నడిచిపోతున్న విద్యార్థులు (ఫైల్)



బస్సురాకతో కృతజ్ఞతలు తెలుపుతున్న విద్యార్థులు, సర్పంచ్

కురిచేడు: మండలంలోని గంగదొనకొండ విద్యార్థులు పొట్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వస్తుంటారు. అయితే వారికి ఎటువంటి రవాణా సౌకర్యం లేదు. గత ఏడాది పదో తరగతి స్టడీ మెటీరియల్ పంపిణీకి వచ్చిన సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు విద్యార్థులు తమ సమస్యను విన్నవించుకున్నారు. ఆ రోజు ఆమెతో పాటు దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి హామీ ఇచ్చారు. ఈ ఏడాది విద్యాసంవత్సరం ఆరంభం నాటికి బస్సు ఏర్పాటు చేస్తామన్నారు. ఇచ్చిన హామీ మేరకు ఒంగోలు ఆర్టీసీ ఆర్ఎంతో మాట్లాడి గురువారం నుంచి బస్సు ఏర్పాటు చేశారు. గంగదొనకొండ సర్పంచ్ ఆసుపల్లి రామలక్ష్మమ్మ, విద్యార్థులు బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ జెండాలతో బస్సు వద్ద నిలుచుని సంబరాలు చేసుకున్నారు.

క్లుప్తంగా

తల్లీకూతురిపై యువకుడు దాడి



చికిత్స పొందుతున్న బాధితురాలు

దర్శి: తల్లీకూతురిపై ఓ యువకుడు దాడిచేసిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున దర్శి పట్టణంలో జరిగింది. పట్టణంలో నివాసం ఉంటున్న అరవా గోవిందమ్మకు సాయి అనే యువకుడితో పరిచయం ఉంది. గోవిందమ్మ కుమార్తె ప్రసన్న మూడు నెలల నుంచి సాయిని ఇంటికి రానివ్వకుండా అడ్డుకుంటోంది. అతన్ని రానివ్వద్దంటూ తల్లికి కూడా సర్దిచెప్పుకుంటూ వస్తోంది. అది సహించలేని సాయి.. మద్యం సేవించి గోవిందమ్మ ఇంటికెళ్లి గొడవపెట్టుకున్నాడు. ఆవేశంలో రాడ్డు తీసుకుని తల్లీకూతుళ్లపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. స్పృహ తప్పి పడిపోయిన వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. స్థానిక ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివాహేతర సంబంధం నేపథ్యంలోనే ఈ ఘటన జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు.

హుండీలో నగదు చోరీ

- నిందితుల అరెస్టు

మద్దిపాడు: హుండీ పగలకొట్టి నగదు చోరీ చేయగా, వెంటనే నిందితులను గుర్తించి అరెస్టు చేసినట్లు మద్దిపాడు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని గుండ్లాపల్లిలో రవి దాబా ఎదురుగా ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన హుండీని శుక్రవారం తెల్లవారుజామున కొందరు గుర్తు తెలియని వ్యక్తులు పగలకొట్టి అందులోని నగదు దోచుకెళ్లారు. దీనిపై వాటర్ ప్లాంట్ ఓనర్ గుంజి రమణయ్య మద్దిపాడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. హుండీలో రూ.4,600 వరకూ నగదు ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్సై శ్రీకాంత్ వేగంగా దర్యాప్తు చేసి నిందితులు మద్దిపాడుకు చెందిన నలుగురిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. వారంతా 16 సంవత్సరాల్లోపు వారే కావడం గమనార్హం.



పొదిలి పట్టణ వ్యూ



సాగర్ నీరు నింపనున్న పెద్ద చెరువు

కల సాకారం

- సాగర్ నీటి కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న పొదిలి ప్రజలు
- పట్టణానికి సరిపడా సాగర్ నీరు అందించేందుకు రంగం సిద్ధం
- రూ.50.13 కోట్లతో మంచినీటి పథకం
- కల నెరవేరుతుండటంతో హర్షం



మంచినీటి పథకం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి (ఫైల్)

పొదిలి: ఎన్నో ఏళ్లుగా పొదిలి వాసుల దాహార్తి తీర్చిన బుగ్గ చలం బోరు వట్టిపోయింది. అరకొరగా వచ్చే సాగర్‌నీరు గొంతు తడుపుకునేందుకు అక్కరకొచ్చింది. సరిపడా సాగర్ నీటి కోసం విన్నపాలు, నిరసనలు, పోరాటాలతోనే సంవత్సరాలు గడిచిపోయాయి. ప్రభుత్వాలు మారాయి. పాలకులు మారారు. కానీ, సమస్య పరిష్కారం కాలేదు. ఈ దశలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర పొదిలి మీదుగా సాగింది. ఆ సమయంలో మంచినీటి కష్టాల గురించి నాయకులు, ప్రజలు విన్నవించుకున్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చి సీఎంగా జగన్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత పొదిలి వాసుల మంచినీటి కష్టాలు గుర్తుంచుకుని మరీ పట్టణంలోని పెద్ద చెరువుకు సాగర్‌నీరు తరలించే పథకానికి నిధులు మంజూరు చేశారు.

17 కిలోమీటర్ల మేర పైపులైన్ ద్వారా సాగర్ నీటి తరలింపు...

పొదిలి వాసుల చిరకాల కోరిక నెరవేరబోతోంది. సాగర్ నీరు రోజూ అందే సమయం దగ్గర్లోనే ఉంది. ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న పొదిలి పెద్ద చెరువుకు సాగర్ నీటి తరలింపు పథకం పనులు ప్రారంభమయ్యాయి. రూ.50.13 కోట్ల నిధులతో కొత్తరెడ్డిపాలెం సమీపంలోని దర్శి సాగర్ కెనాల్ నుంచి పెద్ద చెరువు వరకు సుమారు 17 కిలోమీటర్ల మేర పైపులైన్ ఏర్పాటు చేస్తారు. ఈ పైపులైన్ ద్వారా 700 ఎకరాల విస్తీర్ణం కలిగిన పెద్ద చెరువును సాగర్ నీటితో నింపుతారు. మధ్యలో ముసినది, వాగులు, వంకలు, ఇతర చోట్ల వెల్స్, స్లూయిస్, డెలివరీ సిస్టంల నిర్మాణం జరుగుతోంది. ఈ పథకం కోసం అవసరమైన 0.22 టీఎంసీల నీటి కేటాయింపులు కూడా జరిగాయి. మంచినీటి అవసరాలు తీరనుండటంతో పాటు పొదిలి ప్రాంతంలో భూగర్భ జలాలు కూడా పెరుగుతాయి.

ఎమ్మెల్యే కృషితో నిధుల మంజూరు...

మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికైన తొలినాళ్లలోనే పొదిలిలో నీటి సమస్య తీవ్రతను గమనించారు. జగనన్న పాదయాత్ర హామీ కూడా తోడవ్వడంతో నిధులు మంజూరు చేస్తారనే ధీమాతో కృషి చేశారు. పలు మార్లు పథకం రూపుమారినా, డీపీఆర్‌లు మార్చాల్సి వచ్చినా, ఏఈ స్థాయి అధికారి నుంచి సీఎంఓ వరకు తానే స్వయంగా ఫైల్ నడిపారు. పథకానికి గ్రీన్ సిగ్నల్ వచ్చి నిధుల మంజూరు తర్వాత కూడా టెండర్ల దశను అధికారులతో కలిసి నిత్యం ఎమ్మెల్యే పరిశీలించారు. ఫలితంగా పనులకు శ్రీకారం చుట్టారు.

పట్టణ పరిధిలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం...

పొదిలి పట్టణ పరిధిలో సుమారు 40 వేల జనాభా కలిగిన 20 వార్డులు, 8 వేల గృహాలు ఉన్నాయి. పథకం పూర్తయితే ప్రధానంగా పట్టణంలో నీటి సమస్యకు చెక్ పడుతుంది. పాతూరు, కొత్తూరుతో పాటు బాప్టిస్ట్‌పాలెం, టైలర్స్‌కాలనీ, ప్రకాశ్‌నగర్, శివారు ప్రాంతాల్లో సైతం మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. సమీపంలో పదీ పదిహేను కిలోమీటర్ల మేర భూగర్భ జలాలు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు.

పథకాన్ని సీఎం జగనన్నే ప్రారంభిస్తారు :



పొదిలికి మంచినీటి కోసం సాగర్ జలాల తరలింపు పథకానికి రూ.50 కోట్ల నిధులు మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. ఆ పనులు సత్వరమే పూర్తయ్యేలా నా ప్రత్యక్ష పర్యవేక్షణ ఉంటుంది. పనులన్నీ సకాలంలో జరిగి జగనన్న చేతుల మీదుగా ప్రారంభించేలా చేస్తాం. పథకం నిధుల మంజూరుకు సహకరించిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు.

కేపీ నాగార్జునరెడ్డి, ఎమ్మెల్యే, మార్కాపురం

పుష్కలంగా అందుబాటులోకి మంచినీరు :



ఈ పథకం ద్వారా పట్టణ ప్రజలకు పుష్కలంగా మంచినీరు అందుబాటులోకి వస్తుంది. దీంతో నగర పంచాయతీపై నీటి సరఫరా భారం తగ్గి ఖర్చులు తగ్గుతాయి. ఆ నిధులను మరిన్ని సౌకర్యాల కోసం వినియోగించుకునే వెసులుబాటు కలుగుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా నగర పంచాయతీకి ఎక్కువ మొత్తంలో నిధులు మంజూరయ్యాయి. నిధులు సాధించిన ఎమ్మెల్యే నాగార్జునరెడ్డికి కృతజ్ఞతలు.

డానియేల్ జోసెఫ్, కమిషనర్, పొదిలి నగర పంచాయతీ

పట్టువదలని విక్రమార్కుడు.. ఎమ్మెల్యే :



ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పట్టువదలని విక్రమార్కుడిలా శ్రమించి మంచినీటి పథకం కోసం నిధులు సాధించారు. జగనన్న మాట ఇస్తే పని చేస్తారనే దానికి ఇదే నిదర్శనం. ఏళ్లనాటి నీటి సమస్య పరిష్కారం కావడంతో పాటు తొలి లబ్ధిదారులు ప్రకాశ్‌నగర్ వాసులే కావడం అదృష్టంగా భావిస్తున్నాం. నీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం నిధులు మంజూరు చేసిన జగనన్నకు, మంజూరు చేయించిన నాగార్జునరెడ్డికి రుణపడి ఉంటాము.

నూర్జహాన్‌బేగం, వైఎస్సార్ సీపీ పొదిలి పట్టణ అధ్యక్షురాలు

పట్టపగలు ఇంట్లో చోరీ



ఇంట్లో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

పెద్దారవీడు: మండలంలోని మద్దలకట్ట గ్రామానికి చెందిన అంబటి సుబ్బారెడ్డి ఇంట్లో ఎవరూ లేని సమయంలో శుక్రవారం పట్టపగలే చోరీ జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూలు–గుంటూరు రహదారి పక్కనే సుబ్బారెడ్డి ఇల్లు ఉంది. తన పొలంలో మిరప సాగు చేసేందుకు ఉదయమే కుటుంబ సభ్యులతో కలిసి సుబ్బారెడ్డి వెళ్లాడు. మధ్యాహ్నం పనులు ముగించుకుని తిరిగి ఇంటికి రాగా తాళం పగులకొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు తీసి ఉన్నాయి. అందులోని బంగారు వస్తువులు, డబ్బు కనిపించలేదు. రెండు బంగారు చెయిన్లు, 6 ఉంగరాలు, రెండు జతల చెవికమ్మలు, ఒక జత వెండి గొలుసులు, బంగారు నల్లపూసలదండ, రూ.2 వేల నగదు తీసుకువెళ్లారని, వాటి విలువ దాదాపు రూ.4.50 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపారు. ఆ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా, ఎస్సై పులి రాజేష్ చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి స్థానికులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్లూస్ టీమ్ సభ్యులు వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



చోరీకి గురైన ఇంట్లో దొంగలు తెరిచి ఉంచిన బీరువా

మహిళల బ్యాగులే లక్ష్యంగా చోరీలు

- నిందితులైన నలుగురు మహిళల అరెస్టు
- 45 గ్రాముల బంగారు నగలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి



కేసుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి

ఒంగోలు టౌన్: మహిళల బ్యాగులను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు మహిళలను పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక వన్‌టౌన్ పోలీసుస్టేషన్లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి ఆ వివరాలు వెల్లడించారు. గుంటూరులోని నల్లచెరువు ఎరుకలకాలనీకి చెందిన చిరుమామిళ్ల యశోద, చిరుమామిళ్ల అంజమ్మ అక్కాచెల్లెళ్లు. బాపట్ల జిల్లా చీరాలకు చెందిన పులి రమణమ్మ, ఈపూరిపాలేనికి చెందిన కుంజా లక్ష్మి స్నేహితులు. ఈ నలుగురికి గతంలో దొంగతనాలు చేసిన అనుభవం ఉంది. చిరుమామిళ్ల అంజమ్మ కొంతకాలంగా ఒంగోలులోని పాత చేపల మార్కెట్ వద్ద నివాసం ఉంటోంది. వారం రోజుల క్రితం వీరంతా ఒంగోలులోని అంజమ్మ ఇంటికి వచ్చారు. సులువుగా డబ్బు సంపాదించేందుకు తమకు అలవాటైన దొంగతనాలు చేయడం మొదలుపెట్టారు. స్థానిక కూరగాయల మార్కెట్, గాంధీరోడ్డు, ఆర్టీసీ బస్టాండు, మాల్స్‌కు తిరుగుతూ బాగా రద్దీగా ఉన్న సమయంలో మహిళల బ్యాగులలో చోరీ చేస్తూ వరుస దొంగతనాలకు పాల్పడ్డారు. నగరంలోని రద్దీ ప్రాంతాల్లో ఏమరపాటుగా ఉన్న మహిళల చేతిలోని హ్యాండ్ బ్యాగులు, చేతికర్రలు కలిగిన సంచులలోని పర్సులు దొంగిలించి వాటిలోని నగలు, నగదుతో ఉడాయిస్తున్నారు. దీంతో పలువురు మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ మలికాగర్గ్.. అడిషనల్ ఎస్పీ (క్రైం) ఎస్వీ శ్రీధర్‌రావు, ఒంగోలు డీఎస్పీ బి.మరియదాసు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. దీంతో రంగంలోకి ప్రవేశించిన పోలీసు బృందం అన్నికోణాల నుంచి దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి మూడు కేసులకు సంబంధించి మొత్తం 45 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు.

అభినందనలు తెలిపిన ఎస్పీ...

వరుస దొంగతనాలు చేసి తప్పించుకుని తిరుగుతున్న నలుగురు నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఒంగోలు వన్‌టౌన్ సీఐ టి.వెంకటేశ్వర్లు, ఎస్సై యు.వి.కృష్ణయ్య, ఏఎస్సై కట్టా సురేష్, హెడ్ కానిస్టేబుళ్లు షేక్ ఖాజావలి, సాయికృష్ణ, కె.విజయ్‌కుమార్, కానిస్టేబుళ్లు ఎం.అనిల్, కె.రామరాజు తదితరులను ఎస్పీ మలికాగర్గ్ ప్రత్యేకంగా అభినందించారు.

సముద్రంలో గల్లంతైన ఇద్దరు యువకులు


- కాపాడిన మెరైన్ పోలీసులు



మెరైన్ పోలీసులు కాపాడిన ఇద్దరు యువకులు

సింగరాయకొండ: సముద్రంలో ఇద్దరు యువకులు గల్లంతవగా మెరైన్ పోలీసులు కాపాడిన సంఘటన శుక్రవారం మధ్యాహ్నం మండలంలోని పాకల బీచ్‌లో జరిగింది. మెరైన్ పోలీసుల కథనం ప్రకారం.. బక్రీద్ పండుగ ముగియడంతో కనిగిరి మండలం నుంచి భారీగా ముస్లింలు సముద్రస్నానానికి పాకల బీచ్‌కు వచ్చారు. వారిలో అదే మండలానికి చెందిన చింతలపాలెం గ్రామస్తులు సుమారు 30 మంది వరకు ఉన్నారు. వీరంతా సముద్రస్నానం చేస్తుండగా ఇంటర్ చదివే షేక్ జాబీర్, షేక్ కరిముల్లా ప్రమాదవశాత్తూ సముద్రంలో గల్లంతయ్యారు. గమనించిన మెరైన్ పోలీసులు వెంటనే అప్రమత్తమై వారిద్దరినీ బయటకు లాక్కొచ్చారు. అప్పటికే వారు నీరు బాగా తాగి ఉండటంతో అపస్మారక స్థితికి చేరుకున్నారు. మెరైన్ సిబ్బంది వారికి ప్రథమ చికిత్స చేసి తాగిని నీటిని కక్కించడంతో వారు స్పృహలోకి వచ్చారు. అనంతరం పల్లెపాలెంలోని ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. యువకులను రక్షించిన మెరైన్ పోలీసులను ప్రజలు, యువకుల కుటుంబ సభ్యులు అభినందించారు. మెరైన్ ఏఎస్సై పి.వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ వీవీ సుబ్రహ్మణ్యం, కానిస్టేబుల్ ఎంవీ గోపయ్య, హోంగార్డు ఏ బ్రహ్మానందరావు పర్యవేక్షించారు.

ఎస్పీని కలిసిన ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్



ఎస్పీ మలికాగర్గ్‌తో కమిషనర్ కృష్ణవేణి

ఒంగోలు టౌన్: గుంటూరు జిల్లా జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ బి.కృష్ణవేణి శుక్రవారం ఎస్పీ మలికాగర్గ్‌ను ఆమె చాంబర్‌లో కలిశారు. ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి మాట్లాడారు.

అత్యాచారయత్నం కేసులో నిందితుడికి జైలు శిక్ష

ఒంగోలు టౌన్: మహిళపై అత్యాచారానికి యత్నించిన వ్యక్తికి జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు చెప్పింది. సింగరాయకొండ పోలీసు స్టేషన్ పరిధిలో 29 ఏళ్ల ఒక మహిళ రాత్రి నిద్రిస్తున్న సమయంలో అదే మండలానికి చెందిన తన్నీరు శరత్‌బాబు అత్యాచారానికి యత్నించాడు. 2018 సెప్టెంబర్‌లో జరిగిన ఈ ఘటనపై అప్పటి సింగరాయకొండ ఎస్సై నాగమల్లేశ్వరరావు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. బలమైన సాక్ష్యాలతో చార్జిషీటు వేశారు. నిందితుడు అత్యాచారానికి యత్నించినట్లు నేరం నిరూపణ కావడంతో ఐదేళ్ల జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధిస్తూ ఒంగోలు అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి సోమశేఖర్ శుక్రవారం తీర్పు వెలువరించారు. ఈ కేసులో సరైన సాక్ష్యాధారాలతో గుడ్ ట్రయల్ మానిటరింగ్ చేసి నిందితుడికి శిక్ష పడేలా చేసిన ప్రస్తుత కంభం ఎస్సై మల్లేశ్వరరావు, అడిషనల్ పీపీ యత్తపు కొండారెడ్డి, కోర్టు లైజన్ ఏఎస్సై లక్ష్మీనారాయణ, సమన్స్ అమలుపరిచిన సింగరాయకొండ హెడ్‌కానిస్టేబుల్ బాలమురళిలను ఎస్పీ మలికాగర్గ్ అభినందించారు.

తుపాకీతో హల్‌చల్ చేసిన వ్యక్తి అరెస్ట్

కొమరోలు: తుపాకీతో హల్‌చల్ చేస్తూ గ్రామస్తులను భయభ్రాంతికి గురిచేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు కొమరోలు ఎస్సై ఎ.సుబ్బరాజు తెలిపారు. మండలంలోని రాజుపాలెం గ్రామ సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ కొమరోలులో నివాసం ఉంటున్న పాలుగుళ్ల మోహన్‌రెడ్డి బుధవారం అర్ధరాత్రి తుపాకీతో మూలపల్లె గ్రామానికి వెళ్లి ఓ మహిళ కుటుంబాన్ని బెదిరించి హల్‌చల్ చేశాడు. గ్రామస్తులు మోహన్‌రెడ్డిని విద్యుత్ స్తంభానికి కట్టివేసి దేహశుద్ధి చేసి స్థానిక పోలీసులకు అప్పగించారు. వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు మోహన్‌రెడ్డిపై కేసు నమోదు చేసి అతని వద్ద ఉన్న తుపాకీ, సెల్‌ఫోన్, కారును స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచినట్లు ఎస్సై సుబ్బరాజు తెలిపారు.

వృద్ధుడు అదృశ్యం



కొరపాటి అంజయ్య

ఒంగోలు టౌన్: తాళ్లూరు మండలం కొరపాటివారిపాలెం గ్రామానికి చెందిన 70 ఏళ్ల కొరపాటి అంజయ్య ఈ నెల 28వ తేదీ నుంచి కనిపించడం లేదని ఫిర్యాదు అందినట్లు ఒంగోలు తాలూకా ఎస్ఐ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఒంగోలులోని శివప్రసాద్‌కాలనీలో నివాసం ఉంటున్న కూతురు వద్దకు వచ్చిన ఆయన.. తిరిగి కొరపాటివారిపాలెం బయలుదేరాడు. అప్పటి నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు తాలూకా సీఐ (91211 02127), ఎస్సై (88971 78109)లను సంప్రదించాలని కోరారు.

సాక్షి ఫ్యామిలీ

ఒంగోలు

శనివారం ॥ 1-7-2023

* మనం మాట్లాడుకోవాల్సిందే!

ఆధునికత పేరుతో మన మధ్యలోకి డ్రగ్స్ అనే భూతాలు వచ్చాయి. పబ్ కల్చర్ పెరుగుతున్న ఈ రోజుల్లో అబ్బాయిలే కాదు అమ్మాయిలు కూడా డ్రగ్స్‌కు బానిసలవుతున్నారు. ఈ సమస్య బారిన పడకుండా ఉండాలన్నా, డ్రగ్స్‌కు అడిక్ట్ అయినా మనం మాట్లాడుకోవాల్సిందే!


ప్రతీకాత్మక చిత్రం

డ్రగ్స్‌కు దూరంగా ఉందాం..!

'ఈ దశాబ్దం చివరి నాటికి, ప్రపంచవ్యాప్తంగా డ్రగ్స్ వాడేవారి మోతాదులో దాదాపు 11 శాతం పెరుగుదల ఉంటుంద'ని 'యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్' తన నివేదికలో పొందుపరిచింది. ఇది ఒక సామాజిక సమస్య. మత్తుకు బానిస కావడానికి కారణాలు వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులతో ముడిపడి ఉంటాయి. విద్య, వృత్తి, కుటుంబ ఆదాయం, జెండర్, సామాజిక పోకడలు.. అన్నీ వ్యసనానికి లొంగిపోయే వ్యక్తి ఆలోచనా విధానంపై ప్రభావం చూపుతాయి.

•••

బర్త్ డే పార్టీ అని వెళ్లిన కూతురు సోనీ (పేరు మార్చడమైనది) రాత్రి నుంచి ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వస్తోంది. తన స్నేహితులను కనుక్కుంటే తెలియదనే సమాధానం వచ్చింది. మూడు నెలలుగా సోనీ ప్రవర్తనలో వచ్చిన మార్పులు అమ్మను తెగ భయపెడుతున్నాయి. ఇదే విషయమై భర్తతో చెప్పింది. సోనీ వారికి ఒక్కతే కూతురు. అడిగినవన్నీ అమర్చిపెట్టగలిగే స్తోమత గల కుటుంబం.

సోనీ బీటెక్ సెకండియర్ చదువుతోంది. ఇంటర్మీడియెట్ వరకు ఇంట్లో ఎంత చెబితే అంత అన్నట్టుగా ఉన్న అమ్మాయి ఒక్కసారిగా ఫ్రెండ్స్ బర్త్ డే అనీ, గెట్ టుగెదర్ అనీ, కాలేజీ ఫ్రెషర్స్ డే అనీ, ఫేర్వెల్ అనీ... ఈ మధ్య పార్టీలు బాగా పెరిగిపోయాయి. పార్టీ అన్నప్పుడల్లా డబ్బులు ఇవ్వక తప్పేది కాదు. ఆమె రావడం ఆలస్యం కావడంతో ఓరోజు ఆమె ఫ్రెండ్స్ ద్వారా ఎంక్వైరీ చేసి, తను ఎక్కడ ఉందో తెలుసుకొని వెతుక్కుంటూ అక్కడికి వెళ్లారు.


ప్రతీకాత్మక చిత్రం

కృత్రిమ ఆనందం

- డ్రగ్స్‌కు అలవాటు పడితే ఏం చెప్పినా వినరు. డబ్బులు ఇవ్వకపోతే దొంగతనం చేయడం, పెద్దవాళ్ల మీద చేయి చేసుకోవడం, ఇంకా చేయకూడని పనులు చేసి ఎలాగైనా సరే డ్రగ్స్ తీసుకుంటారు.
- వాళ్లకి వాళ్ల డ్రగ్స్‌కి మధ్యన ఎవరు వచ్చినా భరించరు. అంటే.. తల్లి, తండ్రీ, స్నేహితులు... ఎవ్వరొచ్చినా తట్టుకోలేరు.
- యూత్‌కి బాగా నచ్చే పదాలు 'కొత్తదనాన్ని ఎక్స్‌పీరియెన్స్ చేయాలి.' దీనివల్లే ప్రతీ డ్రగ్ ని ఎక్స్‌పీరియన్స్ చేయాలనే క్యూరియాసిటీతో వాటిని టేస్ట్ చేస్తారు. ఆ సమయంలో కలిగే 'కృత్రిమ ఆనందం' మళ్లీ మళ్లీ మరింత మత్తు కావాలని కోరుకుంటుంది. దీంతో మోతాదు పెరుగుతుంటుంది.

అక్కడ సోనీ ఉన్న తీరును చూసి తల్లీతండ్రి షాకయ్యారు.

మరో నలుగురు అమ్మాయిలు, అబ్బాయిలు ఉన్నారు. మత్తులో ఉన్నట్టుగా కనిపిస్తున్నారు. అడిగిన దానికి ఎవరూ సరిగా సమాధానం చెప్పడం లేదు. వారి చుట్టూ ఉన్న వాతావరణం, వారి వాలకం చూడగానే అర్థమైపోయింది పిల్లలు ఎలాంటి స్థితిలో ఉన్నారో.

•••

సోనీని బలవంతంగా ఇంటికి తీసుకువచ్చారు.

నిద్రలేచి, ఫ్రెష్ అయి మళ్లీ బయటకు వెళ్లబోతున్న సోనీని ఆపింది తల్లి.

'బయట కాలు పెడితే ఊరుకోను, ఇంట్లోనే ఉండు' అని గద్దించాడు తండ్రి. .

'నన్ను ఆపడానికి మీరెవరు.. నా ఫ్రీడమ్‌ను ఎందుకు చంపేస్తున్నారు. ఏం చేస్తారో చేసుకోండి. నేను వెళతాను..' అని తండ్రి మీద రివర్స్ అయిపోయి బయటకు వెళ్లిపోయింది.

ఇక అలాగే వదిలేస్తే కూతురు దక్కదనుకున్నారు తల్లీదండ్రీ.

ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనేంత దూరం సమస్యను తీసుకెళ్లకుండా మొదట్లోనే సరైన పరిష్కారం దిశగా అడుగులు వేయడం, నిపుణుల సలహాలు పాటించడం మేలు.

సైకిక్ ఎనర్జీ

'నా జీవితం ఇది. నాకు చెప్పడానికి నీవెవరు? కన్నావు కాబట్టి భరించాల్సిందే' అంటారు. పరువు, ప్రతిష్ఠ, చదువు, కెరియర్.. దేనికీ వాల్యూ ఇవ్వరు. సైకిక్‌లా ప్రవర్తిస్తారు. ఇందులో అబ్బాయిలు/అమ్మాయిలు ఇద్దరూ ఉన్నారు. ఇది డ్రగ్ ఎడిక్షన్ పర్యవసానం అనే నిజాన్ని కుటుంబ సభ్యులు జీర్ణం చేసుకోలేకపోతున్నాయి. మా పిల్లలు అలాంటివారు కాదు అనుకొని సమాధాన పరుచుకుంటారు.

కౌన్సెలింగ్ తప్పనిసరి

తాము ముందు అనుకున్న లక్ష్యాలను పక్కన పెట్టేసి, ఇలాంటి వాటికి పిల్లలు అట్రాక్ట్ అవుతుంటారు. అందుకని, అమ్మాయి/అబ్బాయి ఎవరైనా సరే మత్తు పదార్థాలకు సంబంధించిన ప్రతీ సిచ్యుయేషన్ ని డిస్కస్ చేయాల్సిందే. 'మా అమ్మాయి/అబ్బాయి ఇలా చేస్తుంటే పదిమందికి ఏమని చెప్పుకుంటాం. ఈ సమస్యకు ఎవరి దగ్గరకు వెళ్లాలో కూడా తెలియడం లేదు' అని కుమిలిపోతుంటారు. దీనికి సరైన పరిష్కారం సైకలాజికల్ కౌన్సెలింగ్.

– నిర్మలారెడ్డి

అనుమానించాల్సిందే!

పిల్లల కొన్ని చర్యల వల్ల వాళ్ళు డ్రగ్ అడిక్ట్ అవునా కాదా సులువుగా తెలుసుకోవచ్చు.

- ఎక్కువ డబ్బులు కావాలని అడుగుతుంటారు. తరచూ పార్టీలకు వెళ్లడం, నా రూమ్‌లోకి ఎవరూ రావద్దు ... అని ఐసోలేట్ అవుతుంటారు. రెబల్స్ అవుతారు/రివర్స్ అవుతారు. పగటిపూట పడుకోవడం, రాత్రిళ్లు మేల్కొవడం చేస్తుంటారు. పెదవులు ఆరిపోవడం, చూపులో తేడా రావడంతోపాటు, వారి బాడీ లాంగ్వేజ్‌లోనూ మార్పులు వస్తాయి. ఇంట్లోకి వచ్చిన వెంటనే రూమ్‌లోకి వెళ్లి, తలుపులు వేసేసుకున్నా, నాకు వేరే పని ఉంది, నేను ఇప్పుడే రాను.. లాంటి మాటలు మాట్లాడుతున్నా అనుమానించాల్సిందే. చదువు విషయంలో సరిగ్గా లేకున్నా చెక్ చేయాలి. సరైన గైడెన్స్ ఇప్పించాలి. ఎక్కడైనా తేడా వస్తే.. థెరపిస్ట్ దగ్గరకు తీసుకెళ్లాలి.
- నా జీవితం, నా స్వేచ్ఛ అనే భావన అమ్మాయిలకు/అబ్బాయిలకు వచ్చేసింది. కానీ, స్వేచ్ఛ ఎంత ఇవ్వాలో దానికో పరిమితి ఉండాలి. ఏడాది, రెండేళ్ల పిల్లలు వెలుగుతున్న క్యాండిల్‌ను పట్టుకోవడానికి ఉత్సాహం చూపుతారు. కాలుతుందని మనకు తెలుసు, ఆ పిల్లవాడికి తెలియదు. అలాంటప్పుడు మనం ఎలా ఆపుతామో, ఇదీ అంతే అని గుర్తించాలి. నా పిల్లలను నేను కంట్రోల్ చేయాల్సిందే.. అనుకున్నప్పుడు మానిటర్ చేయాల్సిందే. అందుకు తగిన సపోర్ట్ తీసుకోవాల్సిందే.
- మంచి జీవనశైలి గురించి చెబితే ఎవరూ వినరు. వారి ఆలోచనా విధానమే మారాలి. ఎప్పుడూ మోటివేట్ చేసుకుంటూ వెళ్లాలి. అప్పుడు మంచి ఫలితం వస్తుంది. శారీరకంగా దెబ్బతినడం, కెరియర్ పాడవడం, సామాజికంగా చెడు పేరు రావడం ఇలాంటివన్నీ సమస్యలే కాబట్టి ఆలోచనా విధానాన్ని మార్చేటట్టు చేయాలి. అయితే, ఆలోచనా విధానం మారడానికి మందులు ఉండవు. ఉదాహరణకు.. ఐస్‌క్రీమ్ తింటే పడటం లేదు అంటే, తినడం మానేయాలి, తప్పదు. అలాగే, మనకు చెడు చేసేవి ఏవైనా వదిలేయాల్సిందే.
- మత్తు పూర్తిగా వదిలించుకోవాలంటే అది ఆ వ్యక్తిని బట్టి ఉంటుంది. మారాలనే ఆలోచన బట్టి రికవరీ వేగంగా ఉంటుంది. 'డ్రగ్స్ వల్ల నాకు డ్యామేజీ అవుతుంది అనుకున్నప్పుడు పరిష్కారాన్ని వెతుక్కోవాలి అనిపిస్తుంది. ఆల్కహాల్/డ్రగ్స్ తీసుకుంటే బాడీ వెంటనే రియాక్ట్ అవుతుంది. ఒక్కసారిగా మానేసినా అంతే రియాక్ట్ అవుతుంది. అందుకని, డిటాక్స్ అండ్ విత్‌డ్రాయల్ మేనేజ్‌మెంట్ చేయాల్సి ఉంటుంది. మత్తుకు అలవాటుపడటం ఒక రోగం అని గుర్తించాలి. దాని మీద ఒక అవగాహన ఏర్పరుచుకోవడం, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కౌన్సెలింగ్ విధానాల ద్వారా దాన్ని అధిగమించాలి.



– డాక్టర్ గిడియన్, డి-అడిక్షన్ థెరపిస్ట్
లివింగ్ సోబర్, హైదరాబాద్

నాలుగైదేళ్లొచ్చినా ఇంకా ముద్దు ముద్దుగా మాట్లాడే పిల్లలే మనకు తెలుసు. అలాంటిది రెండేళ్లకే గలగల మాట్లాడుతూ అందరూ ఆశ్చర్యపోయేలా చేశాడా బుడతడు. అంతేనా? తొమ్మిదో ఏటనే "నాది స్కూలు సిలబస్ చదివి, హోం వర్క్ చేసే వయసు కాదు" అని చెప్పి ఏకంగా కాలేజీ పుస్తకాలు చేతబట్టాడు. నాలుగేళ్లలో చకచకా డిగ్రీ పూర్తి చేసేశాడు. ప్రస్తుతం పద్నాలుగేళ్ల వయసులో ఎలాన్ మస్క్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా హార్డ్‌గా పని చేస్తున్నాడు కైరాన్ క్వాజీ.

పద్నాలుగేళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజినీర్!


కైరాన్ క్వాజీ

నేటి టెక్నాలజీ టీనేజర్స్ కొందరు అది ఇది అనిచెబుతూ ఎంజాయ్ చేస్తూ సమయాన్ని వృథా చేస్తుంటే.. కైరాన్‌లాంటి కుర్రాళ్లు మాత్రం వయసుకు మించిన ప్రతిభతో అద్భుతాలు సృష్టిస్తూ ఔరా అనిపిస్తున్నారు. అత్యంత వేగం, కచ్చితత్వంతో కూడిన ప్రతిభా పాటవాలతో ప్రఖ్యాత స్పేస్ ఎక్స్ కంపెనీ రిక్రూట్‌మెంట్ టెస్ట్ పాసైన కైరాన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎంపికవడమేగాక, కంపెనీలోనే తొలి అతిపిన్న ఇంజినీర్‌గా నిలిచాడు.

అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోకు చెందిన జూలియా, ముస్తాహిద్ క్వాజీ దంపతులకు 2009 జనవరి 27 కైరాన్ పుట్టాడు. చిన్నప్పటి నుంచి ఎంతో చురుకుగా ఉత్సాహంగా ఉండే కైరాన్‌ను గమనించిన తల్లిదండ్రులు.. చక్కగా ప్రోత్సహించేవారు. తెలివిగా చదువుతూ ..ఏడో ఏట యంగ్‌వాంక్స్ కోడింగ్ అకాడమిలో చేరి పైథాన్ ప్రోగ్రామింగ్‌ను నేర్చుకున్నాడు. దీంతోపాటు మెషిన్ లెర్నింగ్‌ను కూడా వంటబట్టించుకున్నాడు.


విధి నిర్వహణలో క్వాజీ


తల్లిదండ్రులతో...

తొమ్మిదేళ్లకే కాలేజీ..

నాది స్కూల్ హోం వర్క్ చేసే వయసు కాదని తన ప్రతిభతో తొమ్మిదో ఏటనే లాస్‌పాసిటాస్ కాలేజీలో చేరి ఈ కాలేజీ చరిత్రలో తొలి పిన్న వయసు విద్యార్థిగా చరిత్ర సృష్టించాడు. ఆ తరువాత పదకొండేళ్లకే మ్యాథమేటిక్స్‌లో డిగ్రీ చదువుతూనే శాంత క్లారా యూనివర్శిటీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ కూడా చదివాడు. ఇదే యూనివర్శిటీలో ఏడాది మాస్టర్స్‌ని పూర్తిచేశాడు. ఇటీవల సాంకేతిక ఫన్ ఇంటర్వ్యూ ప్రాసెస్‌ను అవలీలగా అధిగమించి స్పేస్‌ఎక్స్‌లోని స్టార్‌లింక్ విభాగంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎంపికయ్యాడు. దేన్నైనా ఇట్టే పట్టేసే గుణగణాలే కైరాన్‌ని స్పేస్ ఎక్స్ ఉద్యోగిగా మార్చాయి. అందుకే చిన్న వయసులో డిగ్రీలేగాదు, ఉద్యోగాన్ని కూడా కొట్టేశాడు.

ప్రతిభ, పట్టుదల, కృషి ఎక్కువ

"కైరాన్ చిన్నప్పటి నుంచి చాలా చురుకుగా ఉండేవాడు. అ చురుకుద దాన్ని వెన్నుతట్టి ప్రోత్సహించేవాళ్లం. దాంతో వాడు తన ప్రతిభాపాటవాలకు మరింత పదును పెట్టుకుని టీనేజ్‌లోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా మారాడు. లాస్‌పాసిటాస్ కాలేజీలో చదివేటప్పుడు అకడమిక్ సిలబస్‌ను నేర్చుకోవడమేగాక, స్టాఫ్ అసిస్టెంట్‌గా, స్టెమ్ ట్యూటర్‌గాను పనిచేసేవాడు. ఇతర ట్యూటర్‌లకు సాయం చేస్తూ తన నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నాడు. వేసవి సెలవుల్లో సైబర్ ఇంటిలిజెన్స్ ఇంటర్న్‌షిప్ చేశాడు. దీనితోపాటు బ్లాక్‌బర్డ్ ఏఐలో కూడా ఏఐ ఇంటర్న్‌గా చేశాడు. శాంతక్లారా యూనివర్సిటీ, ఇంటెల్ మెంటర్స్ కూడా కైరాన్‌కు మంచి గైడెన్స్‌ను అందించారు. చేతిరాత, స్పెల్లింగ్, నోట్ టేకింగ్, ఇతర భాషలు నేర్చుకోవడం కాస్త కష్టమైనా.. పట్టుదల, కృషితో నేర్చుకున్నాడు. ప్రస్తుతం బెంగాలీ, మాండరిన్ నేర్చుకుంటున్నాడు. ఎప్పుడు కొత్తదాన్ని నేర్చుకోవడానికి కైరాన్ ఆసక్తి కనబరుస్తాడు. ఆ ఆసక్తే వాడి భవిష్యత్తుని ఉజ్వలంగా తీర్చిదిద్దుతోంది" అని కైరా తల్లిదండ్రులు చెప్పుకొచ్చారు.

"నా నెక్ట్స్ స్టాప్ స్పేస్‌ఎక్స్: ఈ గ్రహంలోనే అత్యంత చక్కని కంపెనీలో స్టార్‌లింక్ ఇంజినీరింగ్ టీమ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేరబోతున్నాను. వయసును బట్టి ఉద్యోగాలలో నియమించే కంపెనీలకు భిన్నంగా. నా ప్రతిభ, పరిపక్వతలను దృష్టిలో పెట్టుకుని స్పేస్‌ఎక్స్ నాకు ఈ ఉద్యోగం ఇచ్చింది" అని తన లింక్డ్ ఇన్ అకౌంట్ ద్వారా కైరాన్ తన కలల జాబ్ గురించి సంతోషంతో చెప్పుకున్నాడు.

ది బాస్ లేడీ

నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్‌ఎస్‌డీ) స్టూడెంట్ అయిన ఆష్క గొరాదియకు బాలీవుడ్‌లో బ్రేక్ రాలేదు. అయితే ఆ అసంతృప్తి ఆమె మాటల్లో ఎప్పుడూ తొంగి చూసేది కాదు. ప్రతి అడుగులో ఆత్మవిశ్వాసం కనిపించేది. ఆ ఆత్మవిశ్వాసమే ఆమెను వ్యాపార రంగం వైపు నడిపించింది. 'రెనీ కాస్మెటిక్స్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఘనవిజయాన్ని సాధించింది...


ఆష్క గొరాదియ

బాల నటిగా కెరీర్ మొదలు పెట్టింది ఆష్క గొరాదియ. తన ప్రయాణంలో రకరకాల సవాళ్లు, కష్టాలు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. వాటివల్ల పోరాటం ఎలా చేయాలో తనకు తెలిసింది. హిందీ సినిమాల్లో నటిస్తున్న కాలంలోనే హాలీవుడ్ కలలతో అమెరికా వెళ్లింది. అక్కడ పెద్దగా అవకాశాలు రాకపోవడంతో తిరిగి ఇండియాకు వచ్చింది.

బాలీవుడ్ సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసి, ఎన్నో టీవి సీరియల్స్‌లో నటించి 'టీవి స్టార్'గా పేరు తెచ్చుకున్న ఆష్క ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రయాణం మొదలుపెట్టాలనుకుంది. అయితే అది అంత తేలిక కాదనేది తనకు తెలియని విషయమేమీ కాదు. తన కళ్ల ముందే ఎన్నో అనుభవాలు ఉన్నాయి. అయితే అవేమీ తనకు అడ్డు కాలేదు. మొదటి అడుగుగా సొంతంగా ప్రొడక్షన్ కంపెనీ మొదలుపెట్టిన ఆష్క, ఎన్నో సక్సెస్‌ఫుల్ టీవీ షోలు చేసింది. ఆ తరువాత ట్రావెలర్స్ కోసం ఒక మొబైల్ యాప్ వెంచర్‌ను లాంచ్ చేసింది. ఆ తరువాత స్నేహితులతో కలిసి ప్రారంభించిన 'రెనీ కాస్మెటిక్స్' ఆమెను స్టార్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా మార్చింది.

ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఆష్క ఘనవిజయం ఎంతోమంది ఔత్సాహికులకు స్ఫూర్తి ఇచ్చింది. ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలనుకునే వారికి ఆమె చెప్పిన కొన్ని సలహాలు...

కల కనాలి... ముందుకు కదలాలి: ఒకరి నుంచి స్ఫూర్తి పొందిన తరువాత కల శ్రీకారం చుట్టుకుంటుంది. అయితే అది సాకారం కావాలంటే ఆచరణలోకి రావాలి. పనికి సంబంధించి స్థాయిని పెంచుకుంటూ పోవాలి.

అంకితభావం ప్లస్ కష్టం: నటన అయినా వ్యాపారమైనా సక్సెస్ కావాలంటే అంకితభావంతో పాటు బాగా కష్టపడాలి. ఒకవేళ విజయం సాధించకపోయినా మనం కన్న కలకు దూరం కావద్దు. ఓటమి నేర్పే పాఠాలతో ముందుకు వెళ్లాలి. సానుకూల ఆలోచనలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

రిస్క్‌కు భయపడితే రిస్క్: ఈతకొట్టడానికి నీళ్లలోకి దిగిన తరువాత నీళ్లకు భయపడితే ఎలా! వ్యాపారం అన్నాక రిస్క్ ఉంటుంది. అంత మాత్రాన వెనక్కి తగ్గనవసరం లేదు. మూస ఆలోచనలకు భిన్నంగా కొత్తగా ఆలోచిస్తే విజయం మన చెంతకు నడిచొస్తుంది.



కోవిడ్ కల్లోల సమయంలో ఎన్నో వ్యాపారాలలాగే మా వ్యాపారం కూడా దెబ్బతింది. 'ఇక నీకు నటనే దిక్కు' అనేవాళ్లు. అయితే నేనెప్పుడూ నమ్మకం కోల్పోలేదు. మంచిరోజులు వస్తాయని గట్టిగా నమ్మాను. అది నిజమైంది.

నెట్‌వర్క్: నటనకైనా, వ్యాపారానికైనా పదిమందితో పరిచయం ముఖ్యం. ఈవెంట్స్, వర్క్‌షాప్‌లకు హాజరుకావడంతో పాటు ఆన్‌లైన్ కమ్యూనిటీలతో టచ్‌లో ఉండాలి. సామాజిక సంబంధాల ద్వారా కొత్త విషయాలు తెలుస్తాయి. ఆలోచన పరిధి విస్తరిస్తుంది. ముందుకు వెళ్లడానికి కావాల్సిన ధైర్యం లభిస్తుంది.

యుఎస్పీ: 'మా బ్రాండ్ ఇది' అని మాత్రమే కాదు 'మా యూఎస్పీ ఇది' అని గర్వంగా చెప్పుకోగలగాలి. మా బ్రాండ్ విషయానికి వస్తే హై-క్వాలిటీ, గతంలో ఎప్పుడూ చూడని ప్యాకేజీ, పాకెట్-ఫ్రెండ్లీ ప్రైస్ అనేవి మా యూఎస్పీ. మార్కెట్ ప్లేస్‌లకు వెళుతూ ఎప్పటికప్పుడు ట్రెండ్స్ తెలుసుకోవాలి.

ఆష్కకు నటన, యోగా, పోల్ డ్యాన్స్, ట్రావెల్ అంటే ఇష్టం. ఇక ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అనేది వాటికంటే రెండు రెట్లు ఎక్కువ ఇష్టమైనది. సినిమాలు, టీవీ సీరియల్స్‌లో ఆష్క 'బిజినెస్ ఉమన్' పాత్ర ధరించలేదు. అయితే నిజ జీవితంలో మాత్రం ఆమె 'బిజినెస్ ఉమన్'గా అద్భుత విజయాన్ని సాధించింది. 'ది బాస్ లేడీ' అని స్నేహితులతో పిలిపించుకుంటోంది.

న్యూస్‌మేకర్


సాబ్రి

మరో స్వర్ణకమలం

సంప్రదాయ నృత్యమంటే ఇష్టం లేని అమ్మాయిని ఆ నృత్యంలో లగ్నం చేసే సినిమా కథ 'స్వర్ణకమలం'. కేరళలో ఇందుకు పూర్తి విరుద్ధమైన కథ జరిగింది. మదరసాలో చదువుకునే ఒక అమ్మాయి కథాకళి పట్ల ఆసక్తితో 80 ఏళ్ల చరిత్ర ఉన్న డాన్స్ స్కూల్‌లో పోరాడి సీటు సాధించుకుంది. కథాకళిలో ముస్లిం అమ్మాయిల ప్రవేశం ఇప్పటి వరకూ లేదు. ఆ నృత్యం నేర్చుకుంటున్న మొదటి అమ్మాయి సాబ్రి.

'చిన్నప్పటి నుంచి కథాకళి చూస్తున్నా. దానికి వేసుకునే మేకప్, దాని కాస్ట్యూమ్స్, ఆ నృత్యవిధానం నన్ను ఆకర్షించాయి. ఎలాగైనా ఆ డాన్స్ నేర్చుకోవాలని చెప్పా. నాన్నకు కూడా ఆ డాన్స్ ఇష్టం. సరేనమ్మా అన్నాడు' అంది సాబ్రి.

ఏడవ క్లాసు పూర్తి చేసిన సాబ్రి ఇప్పుడు తండ్రి నిస్సమ్, తల్లి అనీషాల ప్రోత్సాహంతో కథాకళి నృత్యం నేర్చుకోవడానికి పూనుకుంది. కేరళలోనే కాదు బహుశా దేశంలోనే కథాకళి నేర్చుకుంటున్న తొలి ముస్లిం బాలిక సాబ్రి. అందుకే ఈ అమ్మాయిని అందరూ మెచ్చుకుంటున్నారు. కళకు కులం, మతం భేదం లేదని అంటున్నారు.


డ్యాన్స్ స్కూల్ 'కళామండలం' వద్ద సాబ్రి


డ్యాన్స్ క్లాస్‌లో ...

■ దేవుని గుడిలో చూసి..

సాబ్రి కుటుంబం కొల్లంలో నివసిస్తుంది. తండ్రి నిస్సమ్ ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్. వీరి ఇంటి సమీపంలోనే శ్రీ మహదేవ కోవెల ఉంది. అక్కడ దాదాపు ప్రతి వారం ఏదో ఒక సాయంత్రం కథాకళి నృత్య ప్రదర్శన ఉంటుంది. వృత్తిలో భాగంగా నిస్సమ్ ఆ నృత్య ప్రదర్శన ఫొటోలు తీయడానికి వెళ్లేవాడు. కాలక్షేపంగా ఉంటుందని సాబ్రిని కూడా తీసుకెళ్లేవాడు. 'అలా ఏడేళ్ల వయసు నుంచే నేను కథాకళి నృత్యాన్ని చూస్తున్నాను. ఐదో క్లాసు అయ్యాక ఆ డాన్సును ప్రయివేటు టీచర్ దగ్గరి నుంచి నేర్చుకోవాలనుకున్నాను. కాని కోవిడ్ వల్ల క్లాసులు ఆగిపోయాయి. అదీగాక ఒక ఇన్‌స్టిట్యూట్ నుంచి పరిపూర్ణంగా నేర్చుకోవాలనిపించింది. అందుకే కళామండలంలో చేరాను' అంది సాబ్రి.

■ మగవారికే కథాకళి

కథాకళి నృత్యం ఒక తపస్సు. దాని కోసం జీవితాన్ని అంకితం చేయాలి. స్త్రీల శరీర ధర్మాలు, గృహ ధర్మాలు వారిని పరిపూర్ణంగా ఈ నృత్యంలో నిమగ్నం కాని వ్వవు అనే ఉద్దేశ్యంతో ఈ నృత్యాన్ని ఆది నుంచి పురుషులకే పరిమితం చేశారు. పురుష కళాకారులే కథాకళిలోని స్త్రీల వేషాలను కూడా ధరిస్తారు. ప్రదర్శనను రక్తి కట్టిస్తారు. కథాకళిని పరిరక్షించడానికి కేరళలో ప్రతిష్ఠాత్మకమైన డాన్స్ ఇన్‌స్టిట్యూట్‌లు ఉన్నాయి. అలాంటి వాటిలో ముఖ్యమైనది త్రిసూర్‌కు దగ్గరగా ఉన్న చెరుతురితి అనే ఊరిలోని 'కళామండలం'. ఇది కథాకళిని బాల్యం నుంచి రెసిడెన్షియల్ పద్ధతిలో నేర్పుతుంది. అంటే ఇక్కడ మామూలు స్కూలు, కథాకళి స్కూలు కలిసి నడుస్తాయి. 90 ఏళ్లుగా నడుస్తున్న ఈ సంస్థలో పూర్తిగా అబ్బాయిలకే ప్రవేశం. అయితే గత సంవత్సరమే అమ్మాయిలు కూడా చేరొచ్చు అని అనుమతి ఇచ్చారు. ఎవరూ చేరలేదు. ఈ సంవత్సరం పది మంది అమ్మాయిలు చేరితే వారిలో ఒకమ్మాయి సాబ్రి.

■ కఠిన శిక్షణ

కళామండలంలో 8 వతరగతిలో చేరిన సాబ్రి ఇక అక్కడే హాస్టల్‌లో ఉండిపోవాలి. ఉదయం 4.30 నుంచి లేచి కథాకళి పాఠాలు నేర్చుకోవాలి. 9.30 నుంచి మళ్లీ స్కూలు పాఠాలు నేర్చుకోవాలి. సాయంత్రం ఊళ్లో ఎక్కడ కథాకళి ప్రదర్శన జరుగుతుంటే అక్కడకు తీసుకెళ్లి చూపిస్తారు. 'కథాకళిలోని ప్రదర్శనలన్నీ హిందూ పురాణాల ఆధారంగా ఉంటాయి. మరి నీకు ఆ పాత్రలు పోషించడంలో ఇబ్బంది ఏమీ లేదా' అంటే 'అలా ఏమీ లేదు' అంటుంది సాబ్రి. తండ్రి నిస్సమ్ కూడా 'మా అమ్మాయి డాన్స్ నేర్చుకోవడంలో కళ అందరూ నేర్చుకునే హక్కు నిరూపితం అయ్యింది. ఈ నృత్యం నేర్చుకోవడంలో మా మతస్థుల నుంచి ఎటువంటి అభ్యంతరం లేదు' అని తెలిపాడు.